నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 24 ఫిబ్రవరి 2025 | SIDDIPET

జహీరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు

జహీరాబాద్, ఫిబ్రవరి 23 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏడుపాయల వన దుర్గామాత, కేతకీ సంగమేశ్వరస్వామి జాతరలకు జహీరాబాద్ నుంచి 20 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఆదివారం స్థానిక డిపోలో విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 25 నుంచి 28 తేదీ వరకు ఏడుపాయల వన దుర్గాదేవి ఆలయంతో పాటు ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాలకు దర్శనం నిమిత్తం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు. ప్రతి 15 నిముషాలకు ఒకసారి ఝరాసంగానికి, ప్రతి 30 నిముషాలకు ఒకసారి ఏడుపాయలకు బస్సులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ బస్సులో మహాలక్ష్మి పథకం కింద మహిళాలకు జీరో టికెట్‌తో(ఫ్రీ)గా ప్రయాణించవచ్చని సూచించారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లేందుకు ప్రతి రోజు 7.50 గంటలకు డీలక్స్ బస్సును నడుపుతున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులందరూ సురక్షితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని సూచించారు. ఆ యా ఆలయాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాలిపోయిన గుడిసెముందు నిలబడి దుఃఖిస్తున్న స్వరూప కుటుంబం

నిరాశ్రయులైన పేద కుటుంబం

వర్గల్, ఫిబ్రవరి 23 : సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన చీగురు స్వరూప తాను నివాసముంటున్న పూరి గుడిసె ఆదివారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి దగ్ధమైంది. గుడిసెలో ఉన్న బట్టలు, 2 క్వింటాళ్లకు పైగా బియ్యం, బీరువాలో ఉన్న నగదు,నగలు, విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. ప్రమాద సమయంలో స్వరూప, తన తల్లి భారతి, కొడుకుతో కలిసి పొరుగూరులో ఉన్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు గుడిసె కాలిపోతుందన్న సమాచారం స్వరూపకు చేరవేశారు. దీంతో ఇంటికొచ్చిన స్వరూపకు కాలి బూడిదైన గుడిసె, బీరువా, బియ్యం సంచులను చూసి కన్నీటి పర్యంతమైంది. నిరుపేద కుటంబానికి చెందిన స్వరూప తన భర్త మరణించడంతో తల్లి భారతితో కలిసి కొన్నేండ్లుగా మజీద్‌పల్లిలోనే కాయకష్టం చేసకుంటూ తన కొడుకు అభిలాష్‌తో ఉంటున్నది. ఇప్పుడు తలదాచుకుంటున్న పూరిగుడిసె దగ్ధమవ్వడంతో నిరాశ్రయురాలైంది. దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కన్నీటి పర్యంతమైంది. ప్రమాదం పూర్తి విచారణ చేసి స్వరూపకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజ్ మీడియాకు తెలిపారు.

ప్రమాదంలో కాలిబూడిదయిన గుడిసె

నేటినుంచి బ్రహ్మోత్సవాలు

మహాశివరాత్రి వేడుకులకు సిద్ధమైన కొడవటూరు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 23 : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరులోని సిద్ధేశ్వరాలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 24 నుంచి 27 వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. శివపార్వతుల కల్యాణం, అగ్నిగుండాల ప్రవేశం వంటి ప్రధాన ఘట్టాలతో ఉత్సవాలు జరుగుతాయి. ఉత్సవాలకు వరంగల్ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే గాక ఆలేరు, యాదగిరిగుట్ట, సిద్దిపేట, హైదరాబాద్, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఉత్సవాలు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఈవో చిందం వంశీ, ప్రధాన పూజారి ఓంనమశివాయ తెలిపారు.

పట్టాపగ్గాల్లేని ప్రైవేట్ వైద్యం

- రోగులను రెఫర్ చేస్తే మధ్యవర్తులకు కమీషన్లు
- అధిక బిల్లులు.. మందులతో బాదుడు
- దవాఖానల్లో కానరాని ఫీజుల బోర్డులు
- అంతంతమాత్రంగా జిల్లా వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణ

రోగుల నుంచి దండుకుంటున్న దవాఖానలు.. అవసరం లేకుండా టెస్టులకు సిఫార్సులు

దవాఖానల్లో కానరాని ఫీజుల బోర్డులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ దవాఖానలు, ల్యాబ్‌ల్లో కచ్చితంగా ఫీజుల బోర్డులను ఏర్పాటు చేయాలి. ఏ చికిత్సకు ఎంత తీసుకుంటున్నారో బోర్డులో తెలపాలి. జిల్లాలో కొన్ని దవాఖానల్లో మాత్రమే నార్మల్ డెలివరీ, సిజేరియన్ ఇతరత్రా వాటికి ఎంత ఫీజులు వసూలు చేస్తారో బోర్డులు ఉన్నాయి. మిగతా దవాఖానల్లో ఆ బోర్డులు ఎక్కడా కనిపించడం లేదు. ఓపీ ఫీజు కూడా రూ.300 నుంచి 800 వరకు వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా వైద్యారోగ్య శాఖ అధికారులు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మెదక్, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో ప్రైవేట్ దవాఖానల్లో ఫీజు జులుం నడుస్తున్నది. వైద్యం కోసం దవాఖానకు వెళ్తే జేబు గుల్ల అవుతున్నది అనే ఆరోపణలు ఇటీవల బాగా వినిపిస్తున్నాయి. మెదక్ జిల్లాలో 129 ప్రైవేట్ దవాఖానలు, 49 డయాగ్నోస్టిక్ సెంటర్లు, 56 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. వివిధ అనారోగ్య సమస్యలతో దవాఖానలకు వెళ్లిన రోగులకు అవసరం లేకున్నా పరీక్షల పేరుతో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు రోగుల నుంచి వినిపిస్తున్నాయి. దవాఖానలకు అనుగుణంగానే ల్యాబ్‌లు, మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకున్నారు. సీజనల్ వ్యాధుల సమయంలో చేస్తున్న దోపిడీపై చెప్పనవసరం లేదు. వచ్చిన రోగం తగ్గుతుందని ప్రైవేట్ దవాఖానలకు వస్తే జేబులో డబ్బులు ఖాళీ అవుతున్నాయి. చిన్నపాటి రోగం వచ్చి ప్రైవేట్ దవాఖానలకు వెళ్తే రక్త పరీక్షలు, స్కానింగ్‌లు, ఎక్స్‌రేలు అంటూ రోగిని బెంబేలెత్తించి రూ.వేలల్లో బిల్లులు వేస్తూ వారి జేబుకు చిల్లులు వేస్తున్నారు. మెదక్ జిల్లాలో వైద్యం పూర్తి వ్యాపారంగా మారింది. మల్టీస్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ దవాఖానల పేర్లతో జిల్లాలోని మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట, చేగుంట, పెద్దశంకరంపేట మండలాల్లో అనేకం పుట్టుకొచ్చాయి. వీటిలో వారంలో ఒక రోజు ప్రత్యేక వైద్యులు వస్తారంటూ ప్యాకేజీల పేరుతో ఆర్ఎంపీలు, పీఎంపీలతో కొత్త పంథాకు తెరలేపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రోగులను ప్రైవేట్ దవాఖానలకు రెఫర్ చేస్తే వారికి కమీషన్లు ఇస్తూ రోగుల నుంచి రూ.వేలల్లో బిల్లులు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో బిల్లులు వసూలు చేస్తున్నారు కానీ, మెరుగైన వైద్య సేవలు, కనీస నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. చాలా దవాఖానల్లో చికిత్సలకు సంబంధించిన ధరల పట్టికలు సైతం ఏర్పాటు చేయలేదు. దవాఖానలపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రైవేట్ అంటేనే జంకుతున్న సామాన్యులు...

ప్రైవేట్ దవాఖానకు వెళ్లాలంటే సామాన్యులు జంకుతున్నారు. కొన్ని దవాఖానల్లో డబ్బులు గుంజడమే లక్ష్యంగా పెట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మెదక్ జిల్లాలో చిన్న పిల్లల వైద్యం నుంచి మొదలు స్త్రీ, శిశు, క్రిటికల్ కేర్, జనరల్ మెడిసిన్, సర్జన్లు, ఆర్థో, న్యూరో, గుండె, రేడియాలజిస్టులు, నెఫ్రాలజీ, ఈఎన్‌టీలు, ఫర్టిలిటీ తదితర వైద్య సేవలు అందించేందుకు మల్టీ స్పెషాలిటీ దవాఖానలు వెలిశాయి. కొన్ని చోట్ల అధికంగా మందులు రోగులకు అంటగట్టడం, పరీక్షల పేరుతో డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు వైద్యులకు తమ డయాగ్నోసిస్ కేంద్రాలకు పంపితే కమీషన్లు ఇస్తామంటూ ఎర వేయడంతో అక్కడికి టెస్టులకు రెఫర్ చేస్తున్నారు. కొందరు ప్రైవేట్ దవాఖానల యాజమాన్యాలు ధనాపేక్ష ధ్యేయంగా వైద్య వ్యాపారం సాగిస్తున్నారు. రూ.కోట్లలో పెట్టుబడులు పెడుతూ అంతకు రెట్టింపు సంపాదించే ప్రయత్నం చేస్తున్నారు.ఈ క్రమంలో వైద్యులకు నెలకు ఇంత అని బిజినెస్ టార్గెట్ పెడుతున్నట్లు తెలిసింది. కార్పొరేట్ వైద్యం పేరుతో పేద, మధ్య తరగతి ప్రజల బలహీనతను సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. ఎప్పటికప్పుడు ప్రైవేట్ దవాఖానలపై నిఘా ఉంచాల్సిన వైద్యారోగ్య శాఖ పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ వైద్యం అదుపు తప్పుతోంది. ఫిర్యాదు వస్తే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. తనిఖీలు, పరిశీలనలు లేకపోవడంతో ఇష్టారీతిన సాగుతోంది. ఈ క్రమంలో ప్రైవేట్ దవాఖానల పనితీరు, చికిత్స, అధిక బిల్లులు తదితర అంశాలపై జిల్లావైద్య ఆరోగ్యశాఖ, కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. ప్రైవేట్ దవాఖానల్లో కచ్చితంగా ఫీజుల బోర్డులు ఏర్పాటు చేయాలి. డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో దవాఖానలకు తనిఖీ చేస్తున్నాం.

– డాక్టర్ శ్రీరాం, డీఎంహెచ్‌వో మెదక్

'మా ప్రాంతాన్ని నాశనం చేయకండి'

రిలే దీక్షలో కూర్చున్న చిన్నారులు, మహిళలు, రైతులు

గుమ్మడిదలలో 13వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టిన మల్లికార్జున యాదవ సంఘం సభ్యులు

- ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటును వెంటనే ఆపాలి
- గుమ్మడిదలలో కొనసాగిన ఆందోళనలు
- హైవేపై మొక్కలతో జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ
- మొక్కలతో ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు
- గుమ్మడిదల, నల్లవల్లి గ్రామాల్లో కొనసాగిన రిలే దీక్షలు

గుమ్మడిదలలో హైవేపై మొక్కలతో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, రైతులు, చిన్నారులు

నల్లవల్లిలో 19వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టిన యువకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 23 : డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసి తమ ప్రాంతాన్ని కాలుష్యకారకంగా మార్చి బతుకులు నాశనం చేయవద్దని సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ నల్లవల్లిలో ఆదివారం 19వ రోజు రిలే నిరాహార దీక్ష కొనసాగింది. యువకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. తమ కుటుంబాలు ఎవుసాన్ని నమ్ముకుని బతుకుతున్నాయని, డంపింగ్‌యార్డు ఏర్పాటుతో కాలుష్యంతో తమ బతుకులు ఆగమవుతాయని, ఎవుసం కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మడిదలలో 13వ రోజు రిలే నిరాహార దీక్షలో కొనసాగింది. మల్లికార్జునయాదవ సంఘం, మహిళా జేఏసీ, రైతు జేఏసీ నాయకులు, యువకులు దీక్షలో కూర్చున్నారు. మల్లికార్జున యాదవ సంఘం రూ.5 వేల విరాళం అందజేశారు. అంతకు ముందు గుమ్మడిదలలో జాతీయరహదారిపై మహిళలు, రైతులు, చిన్నారులు మొక్కలు చేతపబట్టుకుని సేవ్ ఫారెస్ట్, సేవ్ ఫార్మర్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు చిన్నారుల సైతం రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నా కాంగ్రెస్ సర్కారుకు మనసు కరగడం లేదా అని వారు ప్రశ్నించారు. ఈ డంపింగ్‌యార్డు కేవలం ఒక గుమ్మడిదల, నల్లవల్లి గ్రామాల సమస్య కాదని, దీనివల్ల నర్సాపూర్, శివంపేట వంటి మండలాలకు ముప్పు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు తాము ఆందోళనలు కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. ఆందోళనల్లో మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, పోచుగారి మోహన్‌రెడ్డి, నల్తురుయాదగిరి, నర్సింలు, స్వేచ్ఛారెడ్డి, మల్లికార్జున సేవ సంఘం సభ్యులు, యాదవ సంఘం సభ్యులు, ఫయాజ్‌షరీఫ్, కుమ్మరి ఆంజనేయులు, చాపలమధు, రామకృష్ణ, సురేశ్, రైతులు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన పోటీలు

బహుమతులు అందుకుంటున్న విజేతలు

నర్సాపూర్, ఫిబ్రవరి 23 : మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో నాలుగు రోజులుగా జరిగిన 'ఈ బాహా ఎస్ ఏఈ ఇండియా-2025' బగ్గీల ఫైనల్ పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ వి.బాలకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎలక్ట్రిక్ అటోమోటీవ్, సెమికండక్టర్ తయారీలో యువత ప్రతిభ కనబరిచి అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు. బీపీసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ సుఖ్మల్ జైన్ మాట్లాడుతూ.. బీపీసీఎల్ ద్వారా ఆవిష్కర్తలకు చేయూత అందిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. 85 జట్ల నమోదుతో ప్రారంభమైన ఈ బాహా సే ఇండియా నాలుగు రోజుల ఉత్కంఠ భరితమైన, ఉత్తేజకరమైన ప్రయాణం చివరి రోజు ఆదివారంతో ముగిసిందని తెలిపారు. 51 బృందాలు సాంకేతిక తనిఖీని విజయవంతంగా క్లియర్ చేశాయని, వాటిలో 44 జట్లు మునుపటి కఠినమైన సవాళ్లను ఎదుర్కొని ఈవెంట్ చివరి దశకు అర్హత సాధించాయని పేర్కొన్నారు. వాటిలో 44 జట్లకు 4వ రోజున 4 గంటల ఎండ్యూరెన్స్ నిర్వహించామని, పురుషుల విభాగంలో పూణేకు చెందిన పింప్రి చించ్‌వాడ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విజేతగా నిలిచినట్లు తెలిపారు. మహిళల విభాగంలో విష్ణు ఇంజినీరింగ్ కాలేజ్ భీమవరం విజేతగా నిలిచారు. ఈ పోటీల్లో పూణేకు చెందిన కారు నెంబర్ ఈ47కి ద్రోణాచార్య అవార్డు ఎమ్ఐటీ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్‌కు చెందిన భీమాగౌడ్ పాటిల్‌కు దక్కింది. విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, బాహాసే ఇండియా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బాలరాజు సుబ్రహ్మణియం, మేనేజింగ్ డైరెక్టర్ రామనాథన్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే, మేనేజర్ బాపిరాజు పాల్గొన్నారు.

తండ్రి హఠాన్మరణంతో ఆగిన పెండ్లి

సత్యనారాయణ గౌడ్ (ఫైల్)

దుబ్బాక,ఫిబ్రవరి 23 : తెల్లారితే కొడుకు పెండ్లి...అర్ధరాత్రి తండ్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. పెండ్లి కూతురు తరుపు వాళ్లు ఫంక్షన్‌హాల్‌లో సంతోషంగా వివాహ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండగా చేదు వార్త వినాల్సి వచ్చింది. వివాహానికి సంతోషంగా వచ్చిన బంధువులు కన్నీటితో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన రాగుల సత్యనారాయణ గౌడ్(66) విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి. కొంతకాలంగా సత్యనారాయణగౌడ్ తన కుటుంబంతో సిద్దిపేటలో నివాసం ఉంటున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు శ్రీనివాస్‌కు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలానికి చెందిన యువతితో ఆదివారం ఉదయం 10గంటలకు దుబ్బాకలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వివాహం జరగాల్సి ఉంది. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో సత్యనారాయణ గౌడ్‌కు గుండెపోటు వచ్చింది. దీంతో ఆయనను వెంటనే దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో కుటుంబీకులు శోకసముద్రంలో మునిగిపోయారు. పెండ్లి వాయిదా పడింది.

బల్దియా.. ఇదేం తీరు..!

- చిరువ్యాపారులపై ప్రతాపం
- ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో బల్దియా అధికారుల తీరుపై ఆరోపణలు
- ఆదాయం కోల్పోతున్నా పట్టించుకోని హుస్నాబాద్ బల్దియా

బడా వ్యాపారులకు లైసెన్సుల జారీలో ఉదాసీనత

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 23: లక్షలాది రూపాయల వ్యాపారాలు సాగించే వ్యాపారసంస్థలకు ట్రేడ్ లైసెన్సులు జారీచేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. చిన్న వ్యాపారులకు మాత్రం నోటీసులు జారీచేస్తూ హెచ్చరిస్తున్నారు. బల్దియా అధికారుల తీరుతో ఆదాయానికి గండిపడుతున్నది. హుస్నాబాద్‌లో పట్టణంలోని హన్మకొండ రోడ్‌లో మూడేండ్ల క్రితం లక్షల రూపాయల వ్యాపారం నిర్వహించే షోరూంను ప్రారంభించారు. మూడేండ్లగా ఆ షోరూంకు ట్రేడ్ లైసెన్సును అధికారులు జారీచేయలేదు. పైగా మేము నోటీసులు ఇస్తున్నాం... అని చెప్పి అధికారులు తప్పుకుంటున్నారు. మూడేండ్లుగా దాదాపు లక్షరూపాయల వరకు ఆదాయాన్ని మునిసిపాలిటీ కోల్పోయింది. ఇదక్కొటే కాదు. ఇలా పెద్ద పెద్ద వ్యాపారాలు నిర్వహించే సంస్థలకు లైసెన్సులు జారీ చేయకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. హుస్నాబాద్ పట్టణంలో ఇప్పటి వరకు 600 మంది వ్యాపారులకు బల్దియా నుంచి ట్రేడ్ లైసెన్సులు జారీ చేశారు. ఇందులో ప్రమాదాలకు సంబంధించి, జనరల్, పరిశ్రమలకు సంబంధించి మూడు రకాల లైసెన్సులను జారీచేశారు. కిరాణం, హోటల్స్, మాల్స్, థియేటర్లు, కబ్‌లు, బేకరీలు, సిమెంట్, స్టీల్, పటాకులు, పరిశ్రమలకు సంబంధించిన వారికి ఇప్పటి వరకు లైసెన్సులు జారీచేశారు. ట్రేడ్ లైసెన్సుల జారీ, రెన్యువల్ కోసం ప్రత్యేకంగా మున్సిపల్ నుంచి రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. బాలఎల్లం, జూనియర్ అసిస్టెంట్ జాలిగాం శంకర్ ఆధ్వర్యంలో వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పనిచేస్తున్నారు. లైసెన్సులు తీసుకోని వ్యాపారాలను గుర్తించి సీజ్ చేసేందుకు సైతం ప్రత్యేక కార్యాచరణను చేపడుతున్నామని అధికారులు చెబుతున్నారు. మరో 400 పైగా దుకాణాలకు లైసెన్సులు జారీచేయాలని భావిస్తున్నా, ఆచరణలో మాత్రం ఆ పరిస్థితి లేకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. పలువురు వ్యాపారాలు పట్ల మున్సిపల్ సిబ్బంది చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వ్యాపారాలు నిర్వహించే దుకాణాలకు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని మున్సిపల్ చట్టం చెబుతున్నది. కానీ, జారీచేసే విషయంలో ఆలసత్వం ఎందుకనేది ఎవరికీ అంతుబట్టడంలేదు. పైగా కొందరు వ్యాపార సంస్థల పరిధిలో కొలతలు తక్కువగా చూపించి లైసెన్సు ఫీజు నమోదు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వాస్తవంగా క్షేత్రస్థాయిలో అధికారులు సరైన విధంగా పట్టించుకోకపోవడంతోనే మున్సిపల్ ఆదాయానికి గండిపడుతున్నదని ఆరోపణలు ఉన్నాయి.

హుస్నాబాద్ టౌన్‌లో ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలంటూ దుకాణాదారుడికి నోటీసులు అందజేస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)

దుకాణాలను సీజ్‌చేస్తాం..

పట్టణంలో ప్రస్తుతం వ్యాపారం నిర్వహిస్తున్న యజమానులు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరిగా పొందాలి. లైసెన్సు ఉన్నవారు రెన్యువల్ చేసుకోవాలని నోటీసులు అందజేస్తున్నాం. లైసెన్సులు తీసుకోని పక్షంలో వారి దుకాణాలను చట్టప్రకారం సీజ్‌చేస్తాం. వ్యాపారులు నిబంధనలు తప్పక పాటించాలి.

–బాల ఎల్లం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హుస్నాబాద్

తిమ్మారెడ్డిపల్లి శివారులో ఇద్దరి ఆత్మహత్య

లక్ష్మి(ఫైల్)

శ్రీధర్ (ఫైల్)

కొండపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 23 : అనుమానాస్పద స్థితిలో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. కుకనూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని సాయి విద్యానగర్‌కు చెందిన శిరోద్కర్ లక్ష్మి(55), రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన టింగ్లేకర్ శ్రీధర్(45) తిమ్మారెడ్డిపల్లి శివారులోని రాజీవ్ రహదారి పక్కన ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు మంటలు ఆర్పి వారిని కాపాడే ప్రయత్నం చేశారు.కానీ, సంఘటనా స్థలంలోనే లక్ష్మి మృతిచెందగా, 80 శాతం కాలిన గాయాలతో ఉన్న శ్రీధర్‌ను టోల్‌గేట్ అంబులెన్స్ ద్వారా సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతురాలి లక్ష్మి భర్త గతంలో మృతి చెందగా శ్రీధర్‌తో పాటు సిద్దిపేటలో కొంత కాలం కిరాయికి ఉండి అక్కడి నుంచి చేర్యాలకు వెళ్లారు. సంఘటనా స్థలంలో మెడికల్ రిపోర్టులు లభ్యం కావడంతో అనారోగ్య కారణాలతోనే శ్రీధర్, లక్ష్మి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపాడు.